క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. 25వేల విరాళం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో దాతల సహకారంతోనే నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం కల్వకుర్తి ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నర్సింహారెడ్డి నిత్యాన్నదానం కోసం రూ. 25వేలను విరాళంగా ఆలయ చైర్మన్‌కు అందజేశారు. దాతను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు, సభ్యుడు పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ ఐడీని జనరేట్ పూర్తి చేయాలి

లింగాల: మండలంలోని ఆయా పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి యొక్క అపార్ ఐడీని ఈ నెల 31వ తేదీ వరకు జనరేట్ పూర్తి చేయాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని లింగాల బాలికల మినీ గురుకుల పాఠశాల, అప్పాయపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల, మల్లొనిచెర్వుతండా పాఠశాలలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలకు సంబంధించి రికార్డులను, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పరిశీలించారు. అపార్ ఐడీని ఎలా పూర్తి చేయాలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

ఐటీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్

నాగర్‌కర్నూల్ క్రైం: తెలంగాణ కాంగ్రెస్ ఐటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, నాగర్‌కర్నూల్ జిల్లా ఐటీసెల్ అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన అనుపటి రమేష్‌ను మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్టానానికి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

డివిజన్ కమిటీ ఎన్నిక

అచ్చంపేట రూరల్: పట్టణంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డివిజన్ కమిటీని మంగళవారం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లాలయ్య, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర తిరుపతయ్య, కోశాధికారిగా బాలస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా మహేష్, మల్లేష్, సహాయ కార్యదర్శిగా పీటర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఈనెల 11న నిర్వహించే మేధావుల సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు సుదర్శన్, నారాయణ, వెంకటయ్య పాల్గొన్నారు.

సర్వేపై సూపర్ చెకప్

బల్మూర్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లను ఇటీవల కార్యదర్శులు సర్వే నిర్వహించగా మంగళవారం ఎంపీడీఓ రాఘవులు వీరంరాజ్‌పల్లి, తోడెల్లగడ్డ గ్రామాల్లో (రిసర్వే) సూపర్ చెకప్ చేశారు. పొందుపర్చిన వివరాలను, దరఖాస్తుదారుల స్థితిగతులను పరిశీలించారు. తప్పులను గుర్తించి అర్హుల జాబితాను తయారుచేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడిన వారిపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 2021 జనవరి నుంచి 2024 ఆగస్టు నెల వరకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల చెల్లింపులో మున్సిపాలిటీలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ రాములు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అల్లం రమేష్ రూ.1,08,86,000 నగదును ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల పేరిట ఇతరుల ఖాతాలకు మళ్లించి అవినీతికి పాల్పడ్డారు. దీనిపై విచారణ జరిపిన మున్సిపల్ అధికారులు నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

కల్వకుర్తిరూరల్: అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బండెల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో రెవెన్యూ డివిజన్ పరిధిలోని రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, చారగొండ, ఊర్కొండ మండలాల్లో రుణమాఫీ కాని రైతులు వేల మంది ఉన్నారన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో గంగాధర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే డా రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వనపట్ల ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి మొక్కలు నాటి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్ సహకారంతో స్కూళ్లకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వేణిపల్లి రమణారావు, ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, క్లస్టర్ హెచ్ఎం కురుమయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నాగర్‌కర్నూల్, తెలకపల్లి మండలాల సంబంధించిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అందజేశారు. అదేవిధంగా పాత మార్కెట్ యార్డ్ స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న నాన్ వెజ్ మార్కెట్ కేంద్రాన్ని పరిశీలించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, కౌన్సిలర్స్, నాయకులు, పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ఉప్పునుంతల: పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చింతల నాగరాజు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆలూరి రమేష్, రామచంద్రయ్య, రాజలింగం, వెంకటస్వామి, భీమయ్య, పద్మ, జయమ్మ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కొల్లాపూర్: విద్యార్థుల పోరాట ఫలితంగానే పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటయ్యాయని బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ బి.దాసు, బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు డి.శేఖర్ అన్నారు. మంగళవారం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులతో వారు సమావేశమయ్యారు. పీయూలో లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటును హర్షిస్తూ విజయోత్సవ పోస్టర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ విడుదల చేశారు. ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ రమేష్ మాదిగ, బీసీ విద్యార్థి సంఘ నాయకులు భరత్ యాదవ్ తదితరులు ఉన్నారు.

కళాశాల అభివృద్ధికి చేయూతనిస్తా



కందనూలు: కళాశాల అభివృద్ధికి చేయూతనిస్తానని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కళాశాల అడ్మిషన్ల ప్రచారానికి రూపొందించిన పాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు విముక్తి

పెంట్లవెల్లి: ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకారులకు స్థానిక పోలీసులు విముక్తి కల్పించారు. వివరాలిలా.. మత్స్య సంపద వేట కోసం తీసుకువచ్చి ఇబ్బందులకు గురిచేస్తుండటంతో కొంతమంది ఆలిండియా డ్రైవర్ అసోసియేషన్ చైర్మన్ హబీబ్ షేక్‌కు ఫోన్‌లో సమాచారం అందించగా ఆయన పలు జిల్లాల నుంచి అసోసియేషన్ సభ్యులతో పెంట్లవెల్లి మండలంలో సంప్రదించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం అక్కడ పనిచేస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన సుభాన్, శ్రీమన్నారయణ, సలీంలను పెంట్లవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. స్థానిక ఎస్‌ఐ రామన్‌గౌడ్ వారితో వివరాలు తీసుకుని తల్లిదండ్రులు, యూనియన్ సభ్యులతో మాట్లాడించి సొంత ప్రాంతాలకు పంపించారు.

దాడులు చేస్తే ఊరుకోం

అమ్రాబాద్: కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగంగిశెట్టి నాగరాజు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండించారు. మండల అధ్యక్షుడు గోలిరాజు, నాయకులు ఉన్నారు.

బీజేపీ నాయకుల దాడి హేయమైన చర్య

అమ్రాబాద్: కాంగ్రెస్ నాయకులపై బీజేపీ నాయకుల దాడి హేయమైన చర్య అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుందమల్లికార్జున్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పిరికిపందల చర్య

పెంట్లవెల్లి: హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర ఖండించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీపై దాడిని పిరికిపందల చర్యగా పేర్కొన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: చికిత్స పొందుతూ వృద్ధుడి మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన బాలయ్య(75) సోమవారం వ్యవసాయపొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలో ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఉప్పునుంతల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్‌ఐ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేవదారికుంట తండాలో 14 రోజులుగా కొనసాగిన అచ్చంపేట విలేజ్ ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీల ముగింపు సమావేశంలో ఎస్‌ఐ పాల్గొని స్థానిక నాయకులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఎస్ఎస్ ఇన్నా టీం గెలుపొందగా సేవాలాల్ వారియర్స్ టీం రెండో బహుమతిని గెలుపొందారు. మొదటి బహుమతిని తండాకు చెందిన మునావత్ అమర్‌సింగ్ జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు రూ. 30 వేలు నగదు అందజేయగా, రెండో బహుమతి కాంగ్రెస్ నాయకుడు కొత్త చిన్నజంగిరెడ్డి అందజేశారు. కట్టా అనంతరెడ్డి, కొత్త చిన్న జంగిరెడ్డి, మొగిలి మహేష్ పాల్గొన్నారు.

చెంచు రైతులకు అవగాహన

బల్మూర్: ఆదివాసి గిరిజన చెంచు రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపకుండా ఆహార భద్రతతో పాటు అధిక ఆదాయాన్ని అందించే పంటలపై కోనేరు సంస్థ ప్రోత్సహిస్తుందని ప్రాజెక్టు మేనేజర్ పెద్దులయ్య తెలిపారు. ఇందులో భాగంగానే బల్మూర్, అమ్రాబాద్, అచ్చంపేట, లింగాల మండలాలకు చెందిన చెంచు రైతులను మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నందు క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. వివిధ రకాల పంటలను సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందుతున్న రైతులతో ముఖాముఖి నిర్వహించారు. చిరుధాన్యాలు, కూరగాయలు, పప్పు ధాన్యాలు పండ్ల తోటల సాగు విధానాన్ని పరిశీలించారు. సంస్థ కోఆర్డినేటర్ ప్రవీన్, ఎల్లేష్, నరసింహ, పెద్దిరాజు, ఆయా మండలాలకు చెందిన చెంచు రైతులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల అరెస్టు



అచ్చంపేటలో హమాలీలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న సివిల్ సప్లై గోదాం ఎదుట నిర్వహిస్తున్న హమాలీ కార్మికుల సమ్మెను ఏడోరోజు మంగళవారం పోలీసులు భగ్నం చేశారు. పోలీసులు సమ్మె శిబిరానికి చేరుకొని కార్మికులను, సీపీఎం నాయకులను అరెస్టు చేసేందుకు యత్నించారు. పోలీసులకు, కార్మికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. శిబిరంలో కూర్చున్న వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం హమాలీ కార్మికులను, సీపీఎం నాయకులను సొంత పూచీకత్తుపై పోలీసులు వదిలిపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, సయ్యద్, కార్మికులు పెద్ద జంగయ్య, చంద్రయ్య, రేణయ్య, తిరుపతయ్య, బాలస్వామి, సైదులు, బక్కయ్య, రాము ఉన్నారు.

హమాలీలను అరెస్ట్ సరికాదు

కల్వకుర్తిరూరల్: శాంతియుతంగా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న సివిల్‌సప్లై హమాలీలను అరెస్ట్ చేయడం తగదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి పరశురాములు అన్నారు. మంగళవారం సివిల్‌సప్లై గోదాం వద్ద హమాలీలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. వివిధ మండలాల్లో హమాలీలను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో ఆంజనేయులు. పర్వతాలు, బాల్‌రెడ్డి, చంద్రయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలి

సాక్షి, నెట్‌వర్క్: రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.15 ఇవ్వాలని సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందికొండ గీత తహసీల్దార్‌కు, కల్వకుర్తిలో ఆర్డీఓ శ్రీనునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఉప్పునుంతలలో ధర్నా నిర్వహించారు. కోడేరులో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. తిమ్మాజిపేటలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ మాట్లాడుతూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ నర్సరీని ఎంపీడీఓ ఆంజనేయులు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మట్టితో నింపిన కవర్లలో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని జాగ్రత్తగా విత్తాలన్నారు. ప్రతిరోజు నీటిని క్రమం తప్పకుండా అందించాలన్నారు. లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఆయన వెంట ఏపీఓ చంద్రసిద్దార్థ, ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య ఉన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులును కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. పలు సమస్యలను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ నాయకులు సంద మల్లయ్య, మల్లేష, కోటీశ్వర్, బుచ్చయ్య, పర్వతాలు, రామస్వామి, సాంబశివుడు పాల్గొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి

అమ్రాబాద్: విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఐకేపీ డీపీఎం శ్రీనివాసులు సూచించారు. మంగళవారం అమ్రాబాద్ రైతు వేదికలో పదర, అమ్రాబాద్ మండలాలకు చెందిన మహిళా సంఘాల కార్యవర్గ సభ్యులు, వీఓఏలు, ఐకేపీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాల రికవరీ వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో శ్రీనిధి రీజనల్ మేనేజర్ మహేంద్రకుమార్, డీపీఎం ఫైనాన్స్ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

కల్వకుర్తి: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని కల్వకుర్తి ఎంవీఐ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని విస్‌డమ్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

పెంట్లవెల్లి: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బాలికల కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం పాఠశాలలోని సదుపాయాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఎస్ఓ సువర్ణ, సాయి చరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలకు మందుల పిచికారీ

పెద్దకొత్తపల్లి: మామిడి తోటలకు ఆశించిన బూడిద తెగులు, బంక తెగుళ్ల నివారణ కోసం రైతులు చర్యలు చేపట్టారు. మామిడి తోటలకు ఇమిడ 500 ఎంఎల్, కార్బండిసమ్ ఒక కేజీ మందులను 500 లీటర్ల ట్రాక్టరు డ్రమ్‌కు రైతులు మందులను కలుపుకొని మామిడి తోటలకు పిచికారీ చేసుకుంటున్నారు. ప్రస్తుతం మామిడి చెట్లు పూత, పిందె దశలో ఉన్నాయి. నీటి తడి ఇవ్వొద్దని ఆయన తెలిపారు.

అధికారుల పనితీరులో మార్పురావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ అధికారులు వారి పనితీరులో మార్పు రావాలని, వారికి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తే ఇకపై కుదరదని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కల్వకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఇబ్బందులు, విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో ఆయా మరమ్మతు పనులు చేపడితే ప్రజలు ఇబ్బందులు పడతారని, ముందుగానే వాటిని సరిచేయాలన్నారు. కల్వకుర్తి మండలానికి చెందిన ఓ విద్యుత్ అధికారి ఇష్టానుసారంగా సరఫరా నిలిపివేస్తున్నారని అధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజా ప్రభుత్వానికి మచ్చతెచ్చేలా అధికారులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.91 కోట్లు..

నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే లింకు రోడ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.91.51 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే చెప్పారు. కల్వకుర్తి, చారకొండ, వెల్దండ మండలాల్లో రోడ్లు అభివృద్ధి చేపట్టేందుకు ఈ నిధులు వినియోగించడంతోపాటు కల్వకుర్తి మండలంలోని తాండ్ర పాఠశాల అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కిషన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి,భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా సంఘం సభ్యురాలికి సంచార చేపల విక్రయ వాహనాన్ని అందజేసి మాట్లాడారు.

- ఉమ్మడి జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి స్వర్గీయ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి పేరు పెట్టడాన్ని హర్షిస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటుగా కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం పలువురికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.
- వెల్దండ మండలంలోని ఆయా గ్రామాలకు ప్రభుత్వం బీటిరోడ్లను మంజూరు చేయడంతో మంగళవారం రాచూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని శాలువాలతో సన్మానించారు.
- పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న పాలబిల్లులు చెల్లించాలని కల్వకుర్తి మండలంలోని తాండ్రా, జూపల్లి గ్రామానికి చెందిన పాడి రైతులు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డికి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

14 నుంచి కబడ్డీ పోటీలు

కోడేరు: మండల కేంద్రంలో ఈ నెల 14, 15, 16 తేదీలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న ఆర్గనైజర్లు రాజేష్, దిలీప్, మహేష్, శివ, కార్తిక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా వివరాలకు సెల్: 6309782760, 9542437436 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని శాలివాహన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్మన్ సత్యం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌కుమార్, రాంరెడ్డిలు, కార్యకర్తలు, శాలివాహన సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ ముక్తభారత్ 100 రోజుల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ అనుమానితులను నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించారు. జిల్లా టీబి అధికారి రాజశేఖర్, ఏపీఓ, మీనాజుద్దీన్, డాక్టర్ బ్లెస్సీ, వైద్య సిబ్బంది ముక్తర్, స్వప్న, లక్ష్మీనరసింహ గౌడ్, వినోద్, దేవకమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని లింగసానిపల్లి సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతిచెందాడు. తెలకపల్లి మండలం ఆలేరుకు చెందిన తిరుపతయ్య(50) పత్తిని కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో ఉన్న జిన్నింగ్ మిల్లులో విక్రయించి స్వగ్రామానికి రాత్రి 8 గంటల సమయంలో బయలుదేరాడు. ఈ క్రమంలో లింగసానిపల్లి సమీపంలో జరుగుతున్న రోడ్డు పనుల వద్ద ట్రాక్టర్ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి డ్రైవర్ కిందకి దూకే ప్రయత్నంలో అదే ట్రాక్టర్ టైర్ కింద పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



కల్వకుర్తి: పట్టణంలోని పలు వార్డులలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ సత్యం కౌన్సిలర్లతో కలిసి మంగళవారం ప్రారంభించారు. మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ కింద 5వ వార్డులో చేపడుతున్న పనుల పురోగతిని తెలుసుకొని, పనులను పూర్తి నాణ్యతతో త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ షాహెద్, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీశైలం, రవి, కమిషనర్ మహమూద్ షేక్, ఏఈ షబ్బీర్, నాయకులు ఆనంద్‌కుమార్, కాలనీవాసులు ఉన్నారు.

'108' సేవలను వినియోగించుకోండి

ఊర్కొండ/ వెల్దండ: జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 108 అంబులెన్స్ సేవలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం వెల్దండ, ఊర్కొండలోని 108 అంబులెన్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, వివిధ రకాల పరికరాలు, వాటి పనితీరు, మందుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్ సెంటర్ నుంచి ఎమర్జెన్సీ కేసు వచ్చిన వెంటనే సిబ్బంది అప్రమత్తమై బాధితులను ప్రమాదవ స్థలి నుంచి ఆస్పత్రికి తరలించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎవరికైనా ఎమర్జెన్సీ ఉన్నచో 108కు కాల్ చేసి ఉచితంగా అంబులెన్స్ సేవలు పొందాలని, అనవసరంగా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటీవ్ శ్రీనివాస్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ మారుతి, పైలెట్ సాయిబాబు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా కే బోల్ సీజన్- 5లో పాల్గొనండి



మాట్లాడుతున్న జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్‌కుమార్

నాగర్‌కర్నూల్ క్రైం: ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే యంగ్ ఇండియా కె బోల్ సీజన్ -5 కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొనాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బెస్ట్ స్పీకర్, బెస్ట్ డిబేటర్‌గా ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు జిల్లా, అసెంబ్లీ, రాష్ట్రస్థాయిలో యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఠీజ్జిజ జీ ఖి యాప్ లో రూ. 250 చెల్లించి 9వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వారు బీజేపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాల వైఫల్యాలపై, డ్రగ్స్ మాఫియాపై, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద గురించి 60 సెకండ్ల వీడియోను రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలోని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మండలాల వారీగా బాధ్యత తీసుకొని విజయవంతం చూడాలన్నారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షుడు తిరుపతయ్య గౌడ్, శ్రీకాంత్, మల్లేష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీతండాలో కార్డెన్ సెర్చ్



వెల్దండ: మండలంలోని ఎంజీకాలనీతండాలో మంగళవారం ఏఎస్పీ రామేశ్వర్, కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అంతకు ముందు తండాలో ఉదయం 6 గంటలకు 70 మంది పోలీస్ సిబ్బందితో 150 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా రూ.20,500 విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. కార్యక్రమంలో వెల్దండ, కల్వకుర్తి, చారకొండ, వంగూరు, ఊర్కొండ ఎస్ఐలు కురుమూర్తి, మాధవరెడ్డి, శంషాద్దీన్, మహేందర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, నాగర్‌కర్నూల్

Os No : 236 of 2024

Between:
Bonagalla Niranjan ..Plaintiff
and
To, Whom So ever Concerned. ..Defendent

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా కక్షిదారుడు అయిన శ్రీ బోనగళ్ళ నిరంజన్ S/o కీ.శే. బుచ్చన్న, R/o తూడుకుర్తి గ్రామం గారి తన చనిపోయిన చిన్నాన కీ.శే. బోనగళ్ళ మశన్న S/o పాయన్న, R/o తూడుకుర్తి గారికి, Class-2 వారసుడిగా నిర్ధారణ చేయమని పైన పేర్కొన్న కేసు ద్వారా సివిల్ దావా వేసినాడు. నా కక్షిదారుని కీ.శే. బోనగళ్ళ మశన్న గారికి వారసునిగా నిర్ధారించడంలో ఎవ్వరికైనా అభ్యంతరం ఉన్నచో పైన పేర్కొన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు తేది.21.01.2025 రోజున ఉ॥ 10.30 గంటలకు స్వయంగా గాని లేక న్యాయవాది గారి ద్వారా గాని హాజరై తన అభ్యంతరములను తెలుపగలరు. అట్లుకానిచో మీ పరోక్షములో కేసు తీర్మానించబడును.

తేది : 07.01.2025 IA No: 955/2024 IN
స్థలం : నాగర్‌కర్నూల్ OS No: 236 of 2024
30.12.2024 రోజు ఇచ్చిన కోర్టు ఉత్తర్వుల ద్వారా

సం/- బోనాసి రాంచంద్రయ్య
అడ్వకేట్, నాగర్‌కర్నూల్ జిల్లా.
సెల్ : 8074147825